విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాష పై అవగాహన, వార్తలు రాయగల సత్తా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
JBN NEWS 24/7
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక
అనంతపురం
శ్రీ సత్యసాయి
5
బుధవారం 15 అక్టోబర్ 2025

# విశాఖ ఏఐ హబ్ పై 5 ఏళ్లలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే అమిలినేని

అనంతపురం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

ఏఐ హబ్ ద్వారా భారత్ ను అంతర్జాతీయ నెట్ వర్క్ తో అనుసంధానించడం ద్వారా రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకుపోతున్న ముఖ్యమంత్రి, ఐటీ శాఖ మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే అమిలినేని

విశాఖ ఏఐ హబ్ ఏర్పాటుకు ఢిల్లీలో గూగుల్ చరిత్రాత్మక ఒప్పందం





కళ్యాణదుర్గం.(అనంత ప్రభ ).కళ్యాణదుర్గం కూటమి యమ్.యల్.ఏ.అమిలినేని సురేంద్రబాబు భారత ప్రభుత్వ సహకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మద్దతుతో విశాఖపట్నంలో నూతనంగా 1 గిగావాట్ సామర్థ్యం గల ఏఐ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు ఐదేళ్లలో విశాఖలో %వి%15 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుని వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే విద్యా, ఐటీ శాకా మంత్రివర్యులు నారా లోకేష్ గారికి గన్నవరం ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికి వారికి శుభాకాంక్షలు తెలిపిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు..లిఇది అమెరికా తర్వాత ప్రపంచంలో గూగుల్ నిర్మించబోయే అతి పెద్ద ఏఐ హబ్. వచ్చే 5 సంవత్సరాల్లో విశాఖ ఏఐ హబ్ నిర్మాణానికి %వి%15 బిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.1,33,000 కోట్లు) పెట్టుబడి పెట్టబోతున్నామని గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సీఈవో థామస్ కురియన్ ప్రకటించారు. ఢిల్లీలోని తాజ్ మాన్ సింగ్ హోటల్ లో జరిగిన కార్యక్రమంలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ ప్రతినిధుల నడుమ చరిత్రాత్మక అవగాహన ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వనీ వైష్ణవ్, గూగుల్ క్లౌడ్ గ్లోబల్ సీఈవో థామస్ కురియన్, బికాష్ కొలే (వైస్ ప్రెసిడెంట్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), కరణ్ బజ్వా (ప్రెసిడెంట్, ఏషియా పసిఫిక్ గూగుల్ క్లౌడ్) తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఈవో థామస్ కురియన్ మాట్లాడుతూ... విశాఖలో 1 గిగావాట్ సామర్థ్యంతో తాము ప్రారంభించే ఏఐ హబ్ ను... భవిష్యత్తులో మరిన్ని గిగావాట్లకు విస్తరిస్తాం. ఇది ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో ఉన్న ఏఐ సెంటర్స్ నెట్‌వర్క్‌లో భాగంగా ఉంటుంది. భారతదేశంలో మేం నిర్మించే అతి పెద్ద ఏఐ కేంద్రం ఇదే. దీనిద్వారా విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధి చేయబోతున్నాం. ఇందుకోసం విశాఖపట్నంలో సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ సబ్ సీ కేబుల్ నెట్‌వర్క్‌ను అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు కనెక్ట్ చేసి, దేశంలోని వివిధ ప్రాంతాల్లోని డిజిటల్ ఆధారిత వ్యవస్థలతో అనుసంధానిస్తాం.ఏఐ టెక్నాలజీతో పాటుగా డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను కూడా అందించబోతున్నాం. ఏఐ హబ్‌లో పూర్తి సాంకేతిక పరిష్కారాలు అందుబాటులో ఉంటాయి. దీనిలో టిపియుఎస్ (టెన్సర్స్ ప్రాసెసింగ్ యూనిట్లను) వాడుతాం, ఇవి ఏఐ ప్రాసెసింగ్‌కు బలం చేకూరుస్తాయి. ఇవి రెండింతల పవర్-ఎఫిషియన్స్ తో పనిచేస్తాయి. స్థానికంగా డేటాను స్టోర్ చేసి సావరిన్ ఏఐ అవసరాలు తీర్చేలా ఏఐ హబ్ పనిచేస్తుంది. జెమిని, ఇమేజనీ వో, ఇంకా మా ఏఐ మోడళ్ళన్నింటితోపాటు యాప్ డెవలప్ మెంట్ కోసం అవసరమైన ఏఐ ప్లాట్ ఫామ్ లను హబ్ అందిస్తుంది. దీనిద్వారా ఉద్యోగులు, వ్యాపారులు, యువత అందరి అవసరాలకు ఏ%శ్రీ% ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తీసుకురాగలమని భావిస్తున్నాం.

ఏఐ హబ్‌లోని ఏఐ టెక్నాలజీ ద్వారా మా గూగుల్ ఐకానిక్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, గూగుల్ సెర్చ్, యూట్యూబ్, జీ మెయిల్, యాడ్స్, ఇతర సేవలు భారతదేశం నుంచే ప్రపంచానికి అందించే అవకాశముంది. భారతదేశానికి ఉత్తమ ఎ%శ్రీ% టెక్నాలజీని అందించడమే మా లక్ష్యం. వివిధ కంపెనీలకు సాంకేతిక సహకారాన్ని అందించడంతోపాటు ఇండియాలో నైపుణ్య శిక్షణ అందించి ఇక్కడ యువతను ప్రపంచస్థాయి ఏఐ నిపుణులుగా తీర్చిదిద్దుతాం. భారత రెగ్యులేటరీ అవసరాలను తీర్చేలా టాలెంట్ పైప్‌లైన్ రూపొందిస్తాం. ఈ హబ్ ద్వారా భారతదేశానికి మాత్రమే కాకుండా ఆసియాతోపాటు ఇతర ప్రపంచ దేశాలకు సేవలు అందించేందుకు కనెక్టివిటీ నెట్‌వర్క్ ఏర్పరచడమే మా లక్ష్యం. గూగుల్ చాలాకాలంగా భారత్ లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. భారత్ లోని ఐదు కేంద్రాల్లో ప్రస్తుతం 14వేలమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఐదేళ్ల క్రితం మేం భారత్ లో గూగుల్ క్లౌడ్ సొల్యూషన్స్ సేవలు ప్రారంభించాం. ఇప్పుడు న్యూఢిల్లీ, ముంబయిలలో ఈ సేవలను అందిస్తున్నాం. గూగుల్ డివైస్ లను భారత్‌లో తయారు చేస్తున్నాం. ఈ సందర్భంగా భారత ప్రభుత్వానికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాకు సహకారం అందిస్తున్న అందిరికీ ధన్యవాదాలు. ఇది గూగుల్ కు ఎంతో విశిష్టమైన రోజు. గూగుల్ తరపున భారత్ ప్రజలకు, ఈ సభలో ఉన్న ప్రతి ఒక్కరికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ఒప్పందం 2047 వికసిత్ భారత్ లో మా భాగస్వామ్యంగా భావించాలని థామస్ కురియన్ పేర్కొన్నారు

## అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి, పేద ప్రజలకు దక్కేంతవరకు వదిలేదే లేదు

- నిరుపేదల కు అండగా నిలబడడమే లక్ష్యం
- లక్ష్యాన్ని సాధించే క్రమంలో ఎన్ని దృష్టి శక్తులు అడ్డొచ్చిన ఎదుర్కొంటాం
- కబ్జా భూమిని కదిలిస్తాం పేదల కళలను నెరవేరుస్తాం
- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం



కూడేరు, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

కూడేరు మండలం బ్రాహ్మణపల్లి సర్వే నంబరు 93 కాలక్రమైనా పెత్తందారుల చేతుల్లో చిక్కుకున్న ఈ ప్రభుత్వ భూమిని నిరుపేదల ఇంటి స్థలాలు పంచేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పేదకు ఇండ్ల స్థలాలు లేక పేదోడు... పేదవాడిగానే మిగిలిపోతున్నాడే తప్ప.. ప్రభుత్వం పేదలకు కనీసం ఇండ్లు స్థలాలు కేటాయిస్తామన్న ఆలోచన లేకుండా పోయిందని రాజకీయ నాయకులు జోక్యంతో ప్రభుత్వాలు పేదలకు అన్యాయం చేస్తున్నారే తప్ప పేదలకు ఎక్కడ న్యాయం జరుగుతుందని జిల్లా కోశాధికారి రాయుడు ప్రశ్నించారు. అందుకనే సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పేద ప్రజల కు ఇల్లు స్థలాలు పంచ తీరుతామని పేదల యొక్క కలను కచ్చితంగా నెరవేరుస్తామని సిపిఐ న్యూ డెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం ఎప్పుడూ నిరుపేదలకు అండగా నిలుస్తూనే ఉంటుందని ఆయన అన్నారు. ఇటీవల రెవెన్యూ అధికారుల నిర్వాకంతో కబ్జా కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూమి పేదల ఇల్లు స్థలాలు పంచే క్రమంలో అధికారులు అనధికారులు పెత్తందారులు, కబ్జాదారులు ఎవరు అడ్డు వచ్చినా సరే ధైర్యంగా ఎవరికి భయపడకుండా పేదలకు ఇంటి స్థలాలు దక్కేంతవరకు ఏఐకేఎంఎస్ పోరాటం సాగిస్తుందని జిల్లా కోశాధికారి రాయుడు అన్నారు. గత దశాబ్ద కాలంలో పెత్తందార్ల చేతిలో చిక్కుకొని అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని కదిలించి పెత్తందారులు అక్రమంగా స్వాధీనం చేసుకున్నటువంటి ప్రభుత్వ భూమిని పేదలకు ఇంటి స్థలాలు పనిచేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సిపిఐ న్యూ డెమోక్రసీ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు హెచ్చరించారు.

## అంతర్జాతీయ బాలికా దినోత్సవము



అనంతపురం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఈ.బి దేవి ఆదేశాల మేరకు కెఎస్ఆర్ హై స్కూల్ నందు జిల్లా మాస్ మీడియా అధికారి ఈ.నాగరాజు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ఈ రోజు బాలికల హక్కులు, వారి విద్య, ఆరోగ్యం, భద్రత మరియు సమాన అవకాశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే రోజు అని మరియు సమాజంలో బాలిక ఒక కుటుంబానికి వెలుగు, ఒక తరం అభివృద్ధికి మూలమని పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ కొంతమంది బాలికలు వివక్షకు గురవుతున్నారనీ బాలికల విద్యలో, ఆరోగ్యంలో, అవకాశాలలో ఈ పరిస్థితి మారాలంటే మనమందరం కలసి కృషి చేయాలనీ వారు తెలిపారు.

ప్రతి బాలికకు ఆరోగ్యసేవలు అందించటం, సమయానికి టీకాలు వేయటం, పోషకాహారం అందించటం, రక్తహీనత వంటి సమస్యలను నివారించటం ఇవన్నీ ఆరోగ్య శాఖ యొక్క ప్రధాన కర్తవ్యాలనీ, అలాగే బాలికల మానసిక ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టడం చాలా అవ-సరమని వారు తెలిపారు. ఇందు కొరకు వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖతో కలిసి ఎన్నో ప్రచార అవగాహన కార్యక్రమాలు జరుగుచున్నవని పేర్కొన్నారు. "బాలిక బలంగా ఉంటే కుటుంబం బలంగా ఉంటుంది, సమాజం అభివృద్ధి చెందుతుంది" అనే సత్యాన్ని మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలనీ వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి నాగరాజు, డిప్యూటీ డెమో త్యాగరాజు,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ ,హెడ్ మాస్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు ఇది దసరా, దీపావళి కానుక

## పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులపై మ్మెల్యే దగ్గుపాటి హర్షం



అనంతపురం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

అనంతపురం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూపులతో ఉద్యోగాలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం దసరా, దీపావళి కానుక ఇచ్చిందని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. పంచాయతీల పునర్నిర్మాణం.. పునర్ వర్గీకరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతపురంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ దీపావళి కానుకగా పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిందన్నారు. పంచాయతీ ఉద్యోగులకు గత 48 ఏళ్ల నుంచి పదోన్నతులు లేని పరిస్థితి ఉండేదన్నారు. మిగతా శాఖల్లో పనిచేసే వారికి ముందుగానే పదోన్నతులు వస్తుంటాయన్నారు. పంచాయతీరాజ్‌శాఖలో అలాంటి పరిస్థితి లేదన్నారు. ఈ సమస్యను ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చిన నేపథ్యంలో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. పంచాయతీలను జనాభా, ఆదాయం ఆధారంగా స్పెషల్ (రూర్బన్) గ్రేడ్, గ్రేడ్ -1, గ్రేడ్ -2, గ్రేడ్ -3లుగా విభజించి పాలన అందించనుందన్నారు. ఇక పంచాయతీ కార్యదర్శిలు పంచాయతీ అభివృద్ధి అధికారులుగా వ్యవహరించనున్నారు. 48 ఏళ్ల తరువాత పంచాయతీరాజ్‌శాఖలో ప్రక్షాళన జరుగుతుండడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తోందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలను, పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కనీసం ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పటికీ ఉద్యోగుల పక్షాన నిలబడుతుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలు సందర్శన



అనంతపురం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

అనంతపురం జిల్లాలో ఉండే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల బి.పప్పూరు. కొర్రపాడు గురుకుల పాఠశాలలను సందర్శించి అక్కడే ఉన్న డిస్టిక్ కో ఆర్డినేటర్ గురుకుల పా-ఠశాల మేడమ్ తో పాఠశాల సిబ్బందితో మాట్లాడడం జరిగింది. అక్కడ ఉండే సమస్యలు విద్యార్థిల యొక్క యోగక్షేమాలు,, మౌలిక వసతులు, విద్యార్థులు కు భోజన వసతికి సంబంధించిన నాణ్యమైన ఆహార పదార్థాలు. తా జా కాయగూరలు, పాలు, గుడ్లు, మెనూకి సంబంధించిన ప్రొవిజన్స్ను పరిశీలించి, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పైన అవగాహన కల్పిస్తూ, క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచనలు చేయడం జరిగింది. గురుకుల పాఠశాలలో కొన్ని సమస్యలు ఉన్నాయని అక్కడ పర్యటన చేసిన తర్వాత మా దృష్టికి వచ్చిన కొన్ని విషయాలు.

కేర్ టేకర్ లేకపోవడం.

హెల్త్ సూపర్వైజర్ లేకపోవడం.

ఐఐటి నీట్ ఫౌండేషన్ తో జరుగుతున్న బి.పప్పూరు స్కూలుకు నెల నెల మెయింటెనెన్స్ బిల్లులు ఇవ్వాలని..

గ్యాస్ కు సంబంధించిన బిల్లలు వెంటనే చెల్లించాలని..ఈ రకంగా అనేక సమస్యలు మా దృష్టికి రావడం జరిగింది వీటిని వెంటనే సెక్రటరీ గారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తాం. అక్కడ సిబ్బందికి తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో నెరమెట్ల ఎల్లన్న గారు. హెచ్ డాక్టర్ అఖిలప్ప మాదిగ గారు. యువసేన నాయకులు బాణాసి శీన మాదిగ. ఎస్సీ ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనుగ రామాంజనేయులు. తదితరులు పాల్గొనడం జరిగింది.

## గ్రామాలలో గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన..



పుట్టపర్తి, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి రాత్రివేళ సమస్యాత్మకమైన ప్రాంతాలలో గ్రామసభలు నిర్వహిస్తూ నేరాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల భద్రతే ముఖ్యం అంటూ పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

మంగళవారం రాత్రి గ్రామాలలో పోలీస్ అధికారులు ,సిబ్బంది పర్యటించి మహిళలు బాలికలపై జరిగే నేరాలు, బాల్య వివాహాలు సైబర్ మోసాలు, పోక్సో కేసులు ,నూతన చట్టాలు పై గ్రామసభల ద్వారా అవగాహన కల్పించారు.

ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, మోసం జరిగితే ఆలస్యం చేయకుండా వెంటనే డైల్ 1930 కు కాల్ చేయాలని సూచించారు. సాయంత్రం వేళ వాహనాలు తనిఖీలు చేపట్టడంతో పాటు ,రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఆపద సమయంలో తక్షణ సహాయం కోసం డైల్ 100, 112 నంబర్లను ఉపయోగించుకోవాలి. ప్రతి మహిళ శక్తి యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. గ్రామాలలో కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఎటువంటి గొడవలకు వెళ్లకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. ఏ సమస్యలు ఉన్న పోలీసులు దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

## కర్ణాటక మద్యం స్వాదీనం




హిందూపూర్, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

హిందూపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చిలమతూరు మండలం మొరసాలపల్లి క్రాస్ వద్ద ఒక వ్యక్తి నుండి కర్ణాటక రాష్ట్రం కు చెందిన హై వర్డ్స్ 48 టెట్రా పాకెట్స్ కలిగి ఉండగా కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడమైనది. అలాగే బలిజేపల్లి గ్రామం మలుపు వద్ద ఒక వ్యక్తి నుండి కర్ణాటక రాష్ట్రం కు చెందిన హై వర్డ్స్ 48 టెట్రా పాకెట్స్ కలిగి ఉండగా కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడమైనది, అలాగే కోడూరు తోపు వద్ద ఒక వ్యక్తి నుండి 10 లీటర్ల లైసెన్స్ లేని కల్లు కలిగి ఉండగాకేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడమైనది. తధానంతరం పట్టణములో ఉన్న మద్యం దుకాణాలు, బార్ల నందు శాంపిల్స్ సేకరించి కెమికల్ ల్యాబ్ కు పంపడమైనది. ఎవ్వరైనా కల్తీ మద్యం అమ్మిన, తయారు చేసి నిల్వ ఉంచిన వారి మీద పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని, ఎవ్వరైనా మద్యం తక్కువ ధరకి సరఫరా చేస్తామని చెప్పగా మాకు సమాచారం ఇవ్వగలరని, వారి వివరాలు గొప్యంగా ఉంచబడునని పేర్కొనడమైనది.

## ప్రత్యేక శుభ్రతా కార్యక్రమం



వెంకటగారిపల్లి, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

ప్రత్యేక శుభ్రతా కార్యక్రమం భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీ ఎ. శ్యామ్ ప్రసాద్ ఐ. ఎ. ఎస్. గారు నేడు (14.10.2025) వెంకటగారిపల్లి గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 13 నుండి 20 వరకు శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో శుభ్రత, పర్యావరణ సంరక్షణ, చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టబడింది.

ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ౦ ప్రతి గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో శుభ్రతను అలవాటు చేసుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాలను ఆరోగ్యవంతంగా, అందంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ అధికారులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు కలిసి శ్రమదానం ద్వారా పంచాయతీని శుభ్రంగా ఉంచాలని సూచించారు.కలెక్టర్ గారు గ్రామంలోని వీధులు, చెత్త నిర్వాహణ కేంద్రాలు, నీటి ట్యాంకులు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సూచనలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీమతి వై. సమత గారు, పుట్టపర్తి మండల అభివృద్ధి అధికారి,ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాలు పాల్గొన్నారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం

యాడికి, అక్టోబర్ 13 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రములోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో యాడికి మండలం చందన గ్రామంలో నివాసముంటున్న వలిపి రెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డి, భార్య పార్వతి, కుమారులు సాయినాథ్ రెడ్డి, గణేష్ రెడ్డి కూతురు ప్రశాంతి, అల్లుడు సుధీర్ రెడ్డి మనవరాలు శాన్వి వీరి కుటుంబము అగాపే ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదానం ఏర్పాటు చేశారని ఆశ్రమ నిర్వాహకుడు బత్తల ప్రసాద్ తెలిపారు. ఎంతో మంది ఆశ్రమంలోనికి వచ్చి అన్నదానం చేస్తున్నారని, ఏ సందర్భము లేకపోయినా అన్నదానం

## ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన దగ్గుపాటి ప్రసాద్



అనంతపురం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

అనంతపురం సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ గారు ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సభ ఏర్పాట్లను మంత్రులతో కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు పరిశీలించారు. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు, ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారి పర్యటనలో భాగంగా జరగనున్న సూపర్ జీఎస్టీ %–% సూపర్ సేవింగ్స్ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు నేడు పరిశీలించారు. మంత్రుల సమక్షంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఉమ్మడి కర్నూలు పర్యటనలో భాగంగా నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద జరగనున్న "సూపర్ జీఎస్టీ %–% సూపర్ సేవింగ్స్" సభావేదిక మరియు బహిరంగ సభ ఏర్పాట్లను టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు గారు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ గారు, మంత్రులు అచ్చెంనాయుడు గారు, నిమ్మల రామానాయుడు గారు, సత్యకుమార్ గారు, టీజీ భరత్ గారు, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ గారు, సహచర ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నాయకులతో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు పరిశీలించారు

## రాష్ట్రస్థాయిలో మెరిసిన బత్తలపల్లి విద్యార్థులు - హరీష్ బాబు సత్కారం



బత్తలపల్లి, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

ధర్మవరం బత్తలపల్లి మండలం జాన్సన్ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ ఉత్సవ్ – 2025 లో భాగంగా రాష్ట్రస్థాయి ప్రతిభా ఫైనల్ పోటీలు అక్టోబర్ 12న హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ పోటీల్లో బత్తలపల్లి మండలంలోని శ్రీ జ్యోతి హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభతో మెరిసారు. విద్యార్థి ఎం. ధరణి సేవ్ గర్ల్ చైల్డ్ మరియు చరణ్ సేవ్ బాయ్ చైల్డ్ అనే అంశాలపై ఆంగ్లంలో చేసిన ప్రేరణాత్మక ప్రసంగాలతో విజేతలుగా నిలిచి, రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. ఈ విజేతలకు భారతదేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వయంగా మెడల్ ప్రదానం చేసి అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు మంగళవారం బత్తలపల్లి మండలంలోని శ్రీ జ్యోతి హైస్కూల్‌ను సందర్శించి, విజేతలైన విద్యార్థులు ఎం. ధరణి, చరణ్ మరియు వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ %–% విద్యార్థుల ప్రతిభను గుర్తించి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల యాజమాన్యం అభినందనీయులు. ఇలాంటి ప్రతిభావంత–౦లైన విద్యార్థులకు ఎల్లప్పుడూ మంత్రి సత్యకుమార్ యాదవ్ నుండి అవసరమైన ప్రోత్సాహం, సహకారం లభిస్తూనే ఉంటుంది. విద్యారంగ అభివృద్ధి ఎన్డీఏ కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలో ఒక ముఖ్య అంశం అని తెలిపారు. అలాగే హరీష్ బాబు బత్తలపల్లి మండలం కేంద్రంలోని ఎం.జె.పి పాఠశాలను కూడా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి, పాఠశాలలో ఉన్న సౌకర్యాలపై, ఎదురవుతున్న సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యలో కూర్చుని మధ్యాహ్నం భోజనం చేసి, వారిని ఆత్మీయంగా ఉత్సాహపరిచారు. ప్రతి విద్యార్థి మన భవిష్యత్తు. వారికి అందుబాటులో ఉన్న వసతులు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాం అని హరీష్ బాబు గారు హామీ ఇచ్చారు


## లోనికోట వార్డులో ప్రజా సమస్యలపై హరీష్ బాబు ప్రత్యక్ష పరిశీలన



ధర్మవరం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

ధర్మవరం పట్టణంలోని లోనికోట ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు స్వయంగా స్పందించారు. బీజేపీ కార్యకర్తలు నందు మరియు మధు లా విన్నపం మేరకు, మంగళవారం హరీష్ బాబు లోనికోట వార్డుకు వెళ్లి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డ్ ప్రజలతో మాట్లాడుతూ, వారి సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. కాల్వలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోవడం, దుర్వాసన వ్యాప్తి వంటి సమస్యలను ప్రజలు వివరించారు. వెంటనే హరీష్ బాబు మున్సిపల్ అధికారులను టెలిఫోన్ ద్వారా సంప్రదించి, కాల్వల శుభ్రత పనులను తక్షణమే ప్రారంభించాలనీ, శానిటేషన్ విభాగం పర్యవేక్షణను నిత్యకృత్యంగా నిర్వహించాలనీ కోరారు. అలాగే వీధి దీపాలు పనిచేయకపోవడం పై ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను గమనించి, విద్యుత్ విభాగం సిబ్బందికి దీపాల మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలనీ, రోడ్ల మరమ్మత్తు పనులపై వివరణాత్మక ప్రణాళిక రూపొందించాలనీ మున్సిపల్ అధికారులకు సూచించారు. పాడైన రోడ్లను తక్షణమే మరమ్మతు చేసి, అవసరమున్న చోట కొత్త రోడ్లు వేయడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని మున్సిపల్ ఇంజినీర్లకు సూచించారు. శానిటేషన్ సిబ్బంది సంఖ్యను పెంచి, చెత్త సేకరణను ప్రతి రోజూ పర్యవేక్షించాలని, ప్రజా ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ,... ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ధర్మవరం పట్టణ అభివృద్ధికి ప్రతి చిన్న అంశాన్నీ గమనిస్తూ చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణం శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుంది, అని పేర్కొన్నారు

## జిల్లా డి.యమ్.ఎచ్.ఓ.ను కలసినకాంగ్రెస్ నాయకులు



అనంతపురం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

అనంతపురం ఈరోజుకాంగ్రెస్ అధ్యక్షులు దాదాగాంధీ ఆధ్వర్యంలో అనంతపురం పట్టణంలో అనంతపూర్ అర్బన్ ఇంచార్జ్ ఎస్ దాదా గాంధీ ఆదేశాల మేరకు సర్వజన ఆస్పత్రి జిల్లా ఆరోగ్య ఆఫీసర్ని కలవడం జరిగినది జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి మరియు ప్రైవేట్ ఆసుపత్రి లో జరుగుతున్న అక్రమాల గురించి జిల్లా ఆరోగ్య అధికార దృష్టికి తీసుకెళ్లడం జరిగినది జిల్లాలో నెలకొన్నటువంటి ఆరోగ్య ప్రధాతగా పేరుగాంచిన ప్రభుత్వ సర్వజన హాస్పిటల్స్ నెలకొన్నటువంటి సమస్యల పైన. గత కొన్ని రోజులుగా వివిధ దినపత్రికలలో వస–్తున్నటువంటి వార్తా కథనాల పైన స్పందిస్తూ ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలో డాక్టర్లు సమ్మెకు సంఘీభావంగా పి.ఎచ్.సి.లో డాక్టర్లతో మాట్లాడి వారి డిమాండ్లను పరిష్కరించాలని అదేవిధంగా ఉరవకొండ పట్టణంలో నందు గల సర్వేజనా ఆసుపత్రిని గత నెలలో జరిగిన కొన్ని సంఘటనలను డాక్టర్ను మరియు సిస్టర్ ను సస్పెండ్ చేయడం అందరికీ తెలిసినదే అర్బన్ అబ్బాయి అనారోగ్యంతో ఆస్పత్రికి వస్తే సరైన వేద సేవలు అందక ప్రాణాలు కోల్పోయాడు పోయిన ప్రాణం తిరిగి రాదు కాబట్టి అంత పెద్ద హాస్పిటల్లో ఎవరు వస్తారు ఎవరు పోతారు పర్యవేక్షించుకోవడం కోసం సీసీ కెమెరాలు వెంటనే ఏర్పాటు చేయాలని అలా చేస్తే డాక్టర్ గారిని నిర్లక్ష్యమా లేక వైద్య సిబ్బంది నిర్లక్ష్యమా లేకపోతే వచ్చిన పేషంట్ల నిర్లక్ష్యము తెలిపోతుంది కావున వెంటనే అన్ని పీహెచ్సీలను సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది . అదేవిధంగా అనంతపురం జిల్లాలో నడిబొడ్డున ఉన్నటువంటి హాస్పిటల్ పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతోంది ఈ ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నటువంటి ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు సాంఘిక శాఖ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు దీని పైన దృష్టి సారించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది . సర్వేజనా ఆస్పత్రిలో నెలకొన్నటువంటి లోపాలను చక్కదిద్ది రోగులకు మంచి వైద్యం అందించాలని కాంగ్రెస్ పార్టీ కోరడమైనది తక్షణం వీటిపైన డిఎంహెచ్వో గారు మరియు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ మరియు జిల్లా వైద్యాధికారి స్పందించాలని కోరడమైనది పార్టీ సీనియర్ నాయకులు కాపు గాజుల వాసు జిల్లా మైనార్టీ అధ్యక్షులు హనిగి శర్మాస్ వలి ఓబీసీ జిల్లా అధ్యక్షులు రామ్ చరణ్ యాదవ్ కేకేసి జిల్లా అధ్యక్షులు హనీకి అబ్బాస్ రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్ ఎం నారాయణస్వామి తదితర నాయకులు డీఎంహెచ్వో మేడమ్ గారిని కలిసి వినత పత్రం ఇవ్వడం జరిగినది

## ప్రశ్నిస్తే దాడులు.. మహిళలపై వేధింపులు



రాప్తాడు, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

రాప్తాడురూరల్:అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామంలో అరాచకాలు సృష్టిస్తున్న కుటుంబాలతో గ్రామస్తులకు ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోయారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలో పోలీసు గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి విన్నవించారు. సుమారు వందమంది గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.బోయ బాలు, బోయ జయరాం, బోయ ఈశ్వర, బోయ శివ, బోయ బాలచంద్ర, ముష్టూరు బోయ అంజితో పాటు వారి బంధువులతో గ్రామంలో ఏ క్షణమైనా ఎలాంటి ప్రమాదమైనా జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పొలిమేర దగ్గర ముష్టూరు గ్రామానికి చెందిన దివంగత బోయ కాటమయ్య 100 సంవత్సరాల క్రితం 5 ఎకరాల డీ పట్టా భూమి ఇతరులతో కొనుగోలు చేశాడన్నారు. ఆయన కుమారులు, మనవళ్లు ఇప్పుడు దౌర్జన్యంగా దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారన్నారు. ఎవరైనా నిలదీస్తే దాడులు చేస్తున్నా రన్నారు. తోటల్లో స్టార్టర్ పెట్టెలు, మోటార్లు, డ్రిప్పులు, స్ప్రింక్లర్లను ధ్వంసం చేస్తున్నారన్నారు. వీరి దెబ్బకు భయపడి తోటల వద్ద మహిళలు ఒంటరిగా ఉండలేని పరిస్థితి ఉందన్నారు. ఇటుకలపల్లి, వజ్రకరూరు, బత్తలపల్లి, కూడేరు, ఉరవకొండ, అనంతపురం వన్‌టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో వీరిపై కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవల గ్రామంలో ఓ యువతికి పెళ్లి నిశ్చయమైతే పెళ్లి చేసుకునే యువకుడికి ఫోన్ చేసి ఆ అమ్మాయి పట్ల అసభ్యంగా చెప్పడంతో ఆ పెళ్లికాస్తా పెటాకులైందన్నారు. ఈ ఘటనపై గ్రామ ప్రజలందరూ ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వారంతా ఇంటి మీదకు వచ్చి గొడవ చేయాలని చూశారన్నారు. గతంలో పోలీసులు కందుకూరు గ్రామంలో ఇలానే నిర్లక్ష్యం చేయడంతో ఒక హత్య జరిగిందని, మన్నీల గ్రామ విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తే అంతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నగిరి ఆదిశేషు, అల్లు షెక్షావలి నాయుడు, అల్లు రామాంజనేయులు, వర్గ ప్రసాద్, రామాంజనేయులు, అన్నగిరి శంకరయ్య, నాగమణి, లక్ష్మీదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



బుక్కరాయసముద్రం, అక్టోబర్ 14 (అనంత ప్రభ)

శింగనమల నియోజక వర్గంలో బాధిత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి శైలజనాథ్ భరోసానిచ్చారు. బీకేఎస్ మండలం చెదుల్ల గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్త వన్నూరప్పను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధితులు పిర్యాదు చేశారు. ఎలాంటి తప్పు చేయకపోయినా పోలీసులు అక్రమ కేసులు బనాయించి స్టేషన్‌కు రావాలని బెదిరిస్తున్నారని వన్నూరప్ప భార్య వాపోయింది. స్పందించిన శైలజనాథ్ వెంటనే పీఎస్‌కు చేరుకుని పోలీసులతో మాట్లాడారు. ప్రజల పక్షాన నిలిచి బాధితులకు న్యాయం చేయాలని, దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు చట్ట బద్దంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంతరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పార్వతి, మాజీ జెడ్పీటీసీ గువ్వల శ్రీకాంతరెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, కాటమయ్య, నరేష్, పూల నారాయణస్వామి, చికెన్ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పూజారి ముసుగులో గంజాయి విక్రయం



గుంతకల్లు, అక్టోబర్ 14 (అనంత ప్రభ)


ఆలయ పూజారి ముసుగులో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితో పాటు మరొకరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎక్సైజ్ సీఐ శివసాగర్ వెల్లడించారు. సోమవారం గుంతకల్లులోని హనుమన్ సర్కిల్‌లో తనిఖీలు చేపట్టిన సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే అడ్డుకుని పరిశీలించారు. వారి వద్ద 4 కిలోల ఎండు గంజాయి గుర్తించి అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ఏలూరు జిల్లా వెంకటాపురంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న పూజారి సురేష్‌బాబు కుమారుడు తిరునగరి మోహన్‌సుందర్ జల్సాలకు అటువాటు పడి పలు దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకుని గుత్తి మండలం అబ్బేదొడ్డి గ్రామ రామాలయంలో అర్చకుడిగా చేరాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి అబ్బేదొడ్డికి చెందిన సాయిరామ్ అలియాస్ గంజాయి సాయి ద్వారా గుత్తి, గుంతకల్లు పట్టణాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవడం మొదలు పెట్టాడు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.







# దోసకాయ వలన కలిగే అద్భుత ప్రయోజనాలు



దోసకాయలు ఆరోగ్యానికి అవసరమయ్యే అనేక ముఖ్యమైన విటమిన్లు మరియు ఖనిజాల యొక్క గొప్ప మూలం. వీటిలో ముఖ్యంగా విటమిన్ సి, విటమిన్ కె మరియు పొటాషియం అధికంగా ఉంటాయి, ఇవన్నీ శరీరంలో ముఖ్యమైన పాత్రలను పోషిస్తాయి.

విటమిన్ సి అనేది యాంటీఆక్సిడెంట్, ఇది హానికరమైన ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది మరియు రోగనిరోధక పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. విటమిన్ కె ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైనది మరియు రక్తం గడ్డకట్టడంలో సహాయపడుతుంది. పొటాషియం ఒక ఖనిజం, ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

దోసకాయలు విటమిన్ ఎ, విటమిన్ బి6 మరియు మెగ్నీషియం వంటి ఇతర పోషకాలను కలిగి ఉంటాయి, అలాగే ఫైబర్, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.

**దోసకాయలోని ఆరోగ్య ప్రయోజనాలు**

**మెరుగైన జీర్ణక్రియ:** దోసకాయలలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది. దోసకాయలో నీరు ఎక్కువగా ఉంటుంది, ఇవి మలం మృదువుగా మరియు సులభంగా బయటకు వెళ్లడానికి సహాయపడతాయి.

**హైడ్రేషన్:** దోసకాయలు 95% కంటే ఎక్కువ నీటిని కలిగి ఉంటాయి, ఇవి హైడ్రేట్‌గా ఉండటానికి మంచి మార్గం. దోసకాయలు తినడం వలన మీరు రిఫ్రెష్ భావనను మరియు శక్తిని పొందవచ్చు, ముఖ్యంగా వేడి వాతావరణంలో లేదా వ్యాయామం తర్వాత తీసుకోవడం చాలా మంచిది.

**బరువు తగ్గడం:** దోసకాయలలో కేలరీలు తక్కువగా ఉంటాయి. నీరు మరియు ఫైబర్ అధికంగా ఉండటం వలన, ఇది ఎక్కువ కేలరీలు తీసుకోకుండా మీరు పూర్తి మరియు సంతృప్తిగా అనుభూతి చెందడానికి సహాయపడుతుంది. ఇది బరువు తగ్గడం లేదా బరువు పెరగటానికి ఆహారంలో భాగంగా చేసుకోవడం ఉత్తమం.

**మెరుగైన చర్మ ఆరోగ్యం:** దోసకాయలు చర్మ సంరక్షణ ఉత్పత్తులలో ప్రముఖమైన పదార్థం, ఎందుకంటే వాటిలో విటమిన్ సి మరియు కెఫిక్ యాసిడ్ ఉన్నాయి, ఇవి చర్మపు చికాకు మరియు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. దోసకాయలను తినడం వల్ల హైడ్రేషన్ మరియు ముఖ్యమైన పోషకాలను అందించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**ఉబ్బరం తగ్గించడం :** దోసకాయలు శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటాయి, ఇవి కళ్ల చుట్టూ ఉబ్బిన ప్రాంతాన్ని తగ్గిస్తాయి. అందుకే మీరు స్పాలలో లేదా సినిమాల్లో కళ్లపై దోసకాయ ముక్కలను ఉపయోగించడం తరచుగా చూస్తారు.

**దోసకాయతో అందం మెరుగు పరుచుకోవడం ఎలా?**

దోసకాయలు మీ ఆరోగ్యానికి మాత్రమే కాదు, మీ చర్మం మరియు జుట్టుకు కూడా మేలు చేస్తాయి. దోసకాయల యొక్క కొన్ని సౌందర్య ప్రయోజనాలు ఇక్కడ తెల్సుకుందాం:

**చర్మ సంరక్షణ:**

దోసకాయలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉండే సమ్మేళనాలను కలిగి ఉంటాయి మరియు చికాకు లేదా ఎర్రబడిన చర్మానికి ఉపశమనం కలిగి ఇస్తాయి. దోసకాయ ముక్కలు లేదా రసాన్ని చర్మానికి అప్లై చేయడం వల్ల ఎరుపు మరియు చికాకు తగ్గుతుంది.

# గోరింటాకు ఎర్రగా పండటానికి అరుదైన చిట్కాలు



మహిళలు గోరింటాకు ఎర్రగా పండాలని కోరుకుంటారు గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి మొగుడు వస్తాడని చాలామంది నమ్మకం అయితే గోరింటాకు ఎర్రగా అందంగా పండాలి అంటే ఏం చేయాలి అనే ప్రశ్న మన మనస్సులో రావచ్చు. ఈ వ్యాసంలో మీ కోసం గోరింటాకు- మెహందీ ఎలా ఎర్రగా పండేలా చేయాలి అనే దానికి ప్రతిస్పందనగా చక్కని అరుదైన చిట్కాలు

గోరింటాకు పెట్టుకునే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత చేతికి ఎలాంటి తడి లేకుండా చూసుకుని తర్వాత మీకు ఇష్టమైన డిజైన్‌ను మీ చేతుల్లో అలంకరించుకోండి. ఏడు నుంచి ఎనిమిది గంటలు అలాగే ఉంచండి. మీరు గోరింటాకు 12 గంటలు అలాగే ఉంచవచ్చు. అదే సమయంలో గోరింటాకు (మెహందీ) తీసినపుడు చాలామంది నీటితో సబ్బుతో కడుగుతారు అలా కాకుండా నీళ్లు లేదా ఎలాంటి సబ్బు ఉపయోగించకుండా గోరింటాకు ఎండు పోయిన తర్వాత గోరింటాకును అర చేతులను కలిపి రుద్దడం ద్వారా గోరింటాకును తొలగించండి. గోరింటాకు పూర్తిగా తొలగించే వరకు ఇలా చేయండి. ఇలా చేయడం ద్వారా మీరు కొన్ని గంటల ప్రభావాన్ని చూస్తారు మరియు మీరు మెహందీ ఎర్రగా అందంగా ఎక్కువ కాలం ఉంటుంది.

**మెహందీ గోరింటాకు నిమ్మ-చక్కెర రసం**

నిమ్మకాయ-చక్కెర గోరింటాకు రంగును ఎర్రగా చేయడానికి సులభమైన మార్గం. నీటిలో కొద్దిగా చక్కెర ఉడకబెట్టి ఈ మిశ్రమం చల్లారిన తర్వాత ఒక గిన్నెలో తీసుకొని దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. గోరింటాకు ఎండిన తర్వాత ఈ మిశ్రమాన్ని రాయండి. చక్కెర గోరింటాకు చర్మంపై ఎక్కువసేపు ఉండటానికి సహాయపడుతుంది, నిమ్మరసం మెహందీ రంగును మరింత లోతుగా చేస్తుంది. మెహందీ ఆరడం ప్రారంభించినప్పుడు మీరు నిమ్మ-చక్కెర రసాన్ని రాయాలి తద్వారా గోరింటాకు -మెహందీ మీ చేతుల్లో ఎక్కువసేపు ఉంటుంది మరియు గోరింటాకు రంగుని మీ చేతుల మీదకి ఇంకెలా చేసి దాని అందాన్ని కూడా పెంచుతుంది.

# అధిక రక్తపోటును అదుపులో ఉంచాలా?

## పాలలో ఇది కలుపుకొని తాగండి

ప్రపంచంలో అధిక శాతం మంది హైపర్ టెన్షన్ లేదా హైబీపీతో బాధపడుతున్నట్టు అంచనా. చాలామందిలో హై బీపీ తీవ్ర స్థాయికి చేరుకునే వరకు పట్టించుకోరు. ఆ తర్వాత వైద్యుడు వద్దకు పరుగులు తీస్తారు. తలనొప్పి, జ్వరం, ఒళ్ళు నొప్పులు, దగ్గు వంటివి బీపీ పెరిగితే కనిపించే లక్షణాలు. ఒకప్పుడు వయసు పెరిగాక మాత్రమే హైబీపీ వచ్చేది. ఇప్పుడు 18 ఏళ్ల వయసు నుంచి కూడా హైపర్ టెన్షన్ లక్షణాలు కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరికి హైబీపీ ఉంటున్నట్టు వైద్యుల అంచనా.

ఇది ఎందుకు వస్తుందో కచ్చితంగా చెప్పలేము. వంశపారంపర్యంగా కూడా హైపర్ టెన్షన్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన ఆహారం తినడం తగ్గించేసింది యువత. ప్రాసెస్డ్ ఫుడ్, పిజ్జాలు, బర్గర్లు, నిల్వచేసిన మాంసం, కూల్ డ్రింకులు, ఫ్రిజ్ లో ఎక్కువ కాలం నిల్వ చేసిన పదార్థాలు తినడం వల్ల కూడా హైబీపీ వస్తున్నట్లు అంచనా. ఉప్పు అధికంగా వాడడం వల్ల హై బీపీ త్వరగా వచ్చేస్తుంది. టెన్షన్ కూడా హైబీపీ వచ్చే అవకాశాన్ని పెంచుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ లో ఎక్కువగా తిరిగేవారు ఈ టెన్షన్ బారిన పడుతున్నారు.

ఆయుర్వేదం ప్రకారం అధిక రక్తపోటు వాత, పిత్త, కఫ అనే మూడు దోషాలలో అసమతుల్యత వల్ల వస్తుంది. శరీరంలో టాక్సిన్స్ చేరడం, చెడు జీవనశైలి, వ్యాయామం లేకుండా నిశ్చలంగా ఉండడం, జీవక్రియ సరిగా జరగకపోవడం వంటివి కూడా అధిక రక్తపోటుకు కారణాలు. అయితే ఆయుర్వేదంలో అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచే ఒక అద్భుత ఔషధం ఉంది.

ఇదొక్కటి చాలు

హైబీపీ బారిన పడినవారు దాన్ని అదుపులో ఉంచాలనుకుంటే ఆయుర్వేదం చిట్కాను సూచిస్తోంది. ప్రతిరోజు ఉదయం పాలలో రెండు మూడు గ్రాముల అర్జున బెరడు పొడిని కలుపుకొని తాగాలి. ఇది రక్తపోటును తగ్గించడమే కాదు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే శక్తివంతమైన ఔషధం.

దీన్ని ఎలా చేయాలంటే

ఈ పానీయాన్ని ఇంట్లో సులభంగా చేసుకోవచ్చు. ముందుగానే అర్జున చెట్టు బెరడు పొడిని కొని ఇంట్లో పెట్టుకోవాలి. ఒక కప్పు పాలను మరిగించి గోరువెచ్చగా ఉన్నప్పుడు ఈ పొడిని వేయాలి. ఇలా రోజుకు



రెండుసార్లు ఈ పాలను తాగడం వల్ల మార్పు మీకే కనిపిస్తుంది. రక్త పోటు అదుపులో ఉంటుంది. అలాగే తాజా ఆకుకూరలు, కూరగాయలు తింటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. దీని వల్ల రక్తపోటు పెరగదు. అర్జున చెట్టు ఎక్కడైనా కనిపిస్తే దాని బెరడు ఒలిచి ఎండబెట్టుకుని పొడి చేసి దాచుకోండి.

# తలనొప్పిగా ఉందా? ఈ చిట్కా పాటిస్తే పెయిన్ కిల్లర్‌తో పనే ఉ



తలనొప్పి అత్యంత సాధారణమైన సమస్య. లోకంలో చాలా మంది మైగ్రేన్ లేదంటే టెన్షన్ వల్ల కలిగే తలనొప్పితో బాధ పడుతున్నారని నార్వేజియన్ నిపుణులు ఒక అధ్యయనం ద్వారా కనుగొన్నారు. పారాసిటమాల్, ఐబుప్రొఫిన్ లేదా ఆస్పిరిన్ వంటి సాధారణ పెయిన్ కిల్లర్స్ తలనొప్పి తగ్గించేందుకు విరివిగా వాడుతున్నారని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు వైద్య నిపుణులు పెయిన్ కిల్లర్ వాడకుండా తలనొప్పి తగ్గించుకునే మార్గాలను వివరించారు.

మెడ కండరాలు బిగుసుకు పోవడం వల్ల కూడా తలనొప్పి వస్తుంది. ఇలాంటి తలనొప్పి తగ్గించుకోవడానికి మెడ కండరాలకు మంచి మసాజ్ ఇస్తే సరిపోతుందట. చాలా సార్లు ఈ చిన్న చిట్కాతో తలనొప్పి తగ్గిపోతుందట. కొన్ని నిమిషాలు కేటాయిస్తే చాలు మెడ కండరాలు బలోపేతం అవుతాయి. మెడ కండరాలు బలంగా ఉంటే తలనొప్పి రాకుండా నివారించవచ్చు. తల మీద చేతిని ఉంచి తలను పక్కకి పది సెకండ్ల పాటు నొక్కి ఉంచడం వల్ల మెడ కండరాలు బలం సంతరించుకుంటాయి.

నీళ్లు ఎక్కువ తాగాలి

డీహైడ్రేషన్ కూడా తలనొప్పికి కారణం అవుతుందని గుర్తుంచుకోవాలి. రోజులో తగినన్ని నీళ్లు తాగడం తప్పనిసరి. కనీసం రోజుకు ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగాలి. ఇలా తగినన్ని నీళ్లు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడం మాత్రమే కాదు, మెదడు కణజాలాలు కూడా ఆరోగ్యంగా, కుంచించుకు పోకుండా ఉంటాయి. మెదడు కణజాలం కుంచించుకు పోతే పుర్రెనుంచి దూరంగా జరగడం వల్ల నాడులు లాగినట్టయి తలనొప్పి వస్తుంది. అలా జరగకూడదంటే తప్పనిసరిగా తగినన్ని నీళ్లు తాగాలి.

సరిపడా నిద్ర తప్పనిసరి

తిండి, నిద్ర, శ్రమ, జీవిత నాణ్యతను నిర్ణయిస్తాయని నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఏది తగ్గినా ఆరోగ్యానికి మంచిది కాదు. నిద్ర సరిపడినంత లేకపోతే మొదట కనిపించే లక్షణం తలనొప్పే. 18 నుంచి 80 సంవత్సరాల మధ్య వయసున్న అందరూ 6 నుంచి 11 గంటల పాటు నిద్ర పోవాల్సిందేనని నిపుణులు సలహా ఇస్తున్నారు. కనీసం 7 నుంచి 9 గంటల పాటు నిద్రపోవాల్సి ఉంటుందట. నిద్ర శరీరానికి విశ్రాంతిని ఇచ్చి మెదడు తిరిగి రెజువనేట్ కావడానికి దోహదం చేస్తుంది. అందువల్ల తలనొప్పి రాకుండా చేస్తుంది.

# పిసిఓఎస్ సమస్యతో బాధపడే మహిళలు తినాల్సిన, తినకూడని ఆహార పదార్థాల జాబితా ఇదిగో



పిసిఓఎస్ సమస్యతో బాధపడే మహిళలకు ఏం తినాలి? అన్న విషయంలో చాలా సందేహాలు ఉంటాయి.పిసిఓఎస్ లేదా పాలీ సిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 10 శాతం కంటే ఎక్కువ మంది మహిళలను వేధిస్తున్న హార్మోన్ల రుగ్మత. పిసిఓఎస్ ఉన్న మహిళల్లో ఆండ్రోజన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉత్పత్తి అవుతుంది. ఇది ఒక మగ హార్మోను. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగిపోతాయి. అంతేకాదు టైప్2 డయాబెటిస్, రక్తపోటు, డిప్రెషన్ వంటివి వీరిలో త్వరగా వస్తాయి. జుట్టు అధికంగా పెరగడం, మొటిమలు రావడం, బరువు త్వరగా పెరగడం, పీరియడ్స్ సరిగా రాకపోవడం వంటివి కూడా వీరిలో ఎక్కువగా కనిపిస్తాయి. గర్భం ధరించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే పిసిఓఎస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు పాటించాలి.

పాలకు బదులు


ఈ సమస్యతో బాధపడుతున్న మహిళలు పాల వినియోగం వల్ల మరింతగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. 2013లో చేసిన అధ్యయనం ప్రకారం తక్కువ పాల ఉత్పత్తులను తీసుకునే వారితో పోలిస్తే, ఎక్కువ మొత్తంలో పాల ఉత్పత్తులను వినియోగించే పిసిఓఎస్ స్త్రీలు ఇన్సులిన్ నిరోధకతను అధికంగా కలిగి ఉంటారు. అయితే వ్యక్తికి వ్యక్తికి ఈ ఫలితం భిన్నంగానే ఉన్నట్టు కూడా అధ్యయనం చెప్పింది. పాల ఉత్పత్తులు మీకు సరిపడకపోతే ప్రత్యామ్నాయంగా ఓట్స్ పాలు, బాదం పాలు, సోయా పాలను ఎంచుకోవడం మంచిది. పనీర్‌కు [illegible]దులుగా సోయాతో చేసిన టోఫూను తినవచ్చు.

ఉడికించినవే

వేయించిన ఆహారాలు, కాల్చిన ఆహారాలలో ట్రాన్స్ ఫ్యాట్స్ అధికంగా ఉంటాయి. క్యాలరీలు కూడా ఎక్కువే. వీటిని తినడం వల్ల పిసిఓఎస్ సమస్య పెరుగుతుంది. ఇన్సులిన్ నిరోధక శక్తి మరింతగా దిగజారుతుంది. కాబట్టిపిసిఓఎస్ సమస్యతో బాధపడుతున్న మహిళలు వేయించిన, కాల్చిన ఆహారాలకు దూరంగా ఉండాలి. ఉడికించిన ఆహారాన్ని ఎప్పుడు ఎంచుకోవాలి.

# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?





కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ. 50 లక్షల నుంచి రూ. 75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేర-ువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పు-రస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచింది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యురిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు. పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉ-ంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?





సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస-్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలే-సుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉ-ంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీ పురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికి.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్ట్స్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యురిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మా-త్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాంతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉ-ంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్ మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభి్ర-పాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com